1

నవతెలంగాణ

నమ్మదగ్గ తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

గురువారం | ఫిబ్రవరి 27, 2025 | www.navatelangana.com

బట్టలు పంపిణీ చేసిన మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి

నవతెలంగాణ-తలమడుగు

రుయ్యాడి గ్రామంలో గల శివాలయంలో మహా శివరాత్రి సందర్భంగా బుధవారం గ్రామంలోని 200 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. గతంలో సొంత డబ్బులతో శివాలయ నిర్మాణం చేపట్టగా, 27 సంవత్సరాలుగా మహాశివరాత్రిని పురస్కరించుకొని గ్రామంతో పాటు వివిధ గ్రామాల నుండి వచ్చిన మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గోక గణేష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు కాంగ్రెస్ మండల కన్వీనర్ రాజేశ్వర్, ఆ పార్టీ నాయకులు విలాస్, అశోక్, వెంకటేష్, రామచంద్ర దేశ్‌ముఖ్, పోతన్న పాల్గొన్నారు.



ఇంజన్‌లో మంటలు చెలరేగి కాలిపోయిన టాటా ఏసీ వాహనం

నవతెలంగాణ-జైపూర్

కన్నెపల్లి మండలం కొత్తపల్లి నుండి కాళేశ్వరం బయలుదేరిన టాటా ఏసీ(నెం.ఏపీ 36 టీవీ 0743) వాహనం ఇంజన్‌లో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. బుధవారం ఉదయం కొత్తపల్లి నుండి ప్రయాణికులతో బయలుదేరిన టాటా ఏసీ భీమారం మండలం భూర్గుపల్లికి చేరుకోగానే ఇంజన్‌లో మంటలు చెలరేగాయని స్థానికులు తెలిపారు. ఓవర్ హీట్ లేదా షార్ట్ సర్క్యూట్‌తో ఇంజన్‌లో మంటలు వస్తాయని భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎవరికి ప్రమాదం జరగకపోయినా టాటా ఏసీ మొత్తం మంటల్లో కాలిపోయింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేశారు.



నేడే మండలి పోరు..!

- పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం
- ఉదయం 8గంటల నుంచి ప్రారంభం
- ఉమ్మడి జిల్లాలో 74,707మంది ఓటర్లు
- 56మంది పట్టభద్రులకు..15మంది ఉపాధ్యాయ స్థానానికి పోటీ
- మార్చి 3న ఫలితాలు వెల్లడి

కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ స్థానం పోరుకు సర్వం సిద్ధమైంది. గురువారం ఉదయం 8గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 4గంటలకు ముగియనుంది. ఈ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఉమ్మడి జిల్లాలో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. పోలింగ్ కేంద్రాలు, ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులతో పాటు మైక్రో అబ్జర్వర్లు, ఇతర పోలింగ్ సిబ్బందిని నియమించింది. పంపిణీ కేంద్రాల నుంచి బుధవారం సాయంత్రం బ్యాలెట్ బాక్సులను ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. నాలుగు జిల్లాల పరిధిలో ఈ ఎమ్మెల్సీ స్థానంలో పట్టభద్రుల స్థానానికి 56మంది పోటీ చేస్తుండగా.. ఉపాధ్యాయ స్థానానికి 15మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో 74,707మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 65,232మంది పట్టభద్రులు ఉండగా.. 6872మంది ఉపాధ్యాయులు ఉన్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

శాసనమండలి పోరుకు సర్వం సిద్ధమైంది. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ స్థానానికి జరగనున్న ఎన్నిక కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఆయా జిల్లాల వారీగానే జరగనున్న ఈ ఎన్నికలకు అధికార యంత్రాంగం పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులను పంపిణీ పంపించారు. నాలుగు జిల్లాల పరిధిలో 42 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉన్న ఈ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 3.59లక్షల మంది ఓటర్లు ఉండగా..ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 74,707మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన అధికారులు, సిబ్బంది నియామకాన్ని పూర్తిచేయగా..వారందరూ బుధవారం సాయంత్రమే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు పంపిణీ కేంద్రాల వద్దకు పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. పోలింగ్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్నికల అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మరోపక్క ఓటు హక్కు వినియోగించుకోనున్న పట్టభద్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో పనిచేస్తున్న పట్టభద్రులకు సెలవు వర్తించేలా ప్రభుత్వం అనుమతిచ్చింది. అధికార యంత్రాంగం ఇప్పటికే ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేసింది.

పట్టభద్రులకు 56మంది..టీచర్‌కు 15మంది పోటీ

కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఎమ్మెల్సీ స్థానానికి జరగనున్న ఓటింగ్‌లో 56మంది అభ్యర్థులు పట్టభద్రుల స్థానానికి 15మంది ఉపాధ్యాయ స్థానానికి పోటీ చేస్తున్నారు. ఈ ఎన్నికల కోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 160 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. 65,232మంది పట్టభద్రులు, 6872మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. బరిలో నిలిచిన అభ్యర్థులు గత మూడు నెలలుగా నాలుగు జిల్లాల పరిధిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల స్థానానికి కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, ఇతర రాజకీయ పార్టీల తరపున బరిలో దిగడంతో పాటు పలువురు స్వతంత్రులుగా పోటీ చేస్తున్నారు. ప్రత్యక్షంగా ప్రచారం నిర్వహించడంతో పాటు సోషల్ మీడియా ద్వారా ముమ్మరం ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయ స్థానానికి సైతం పలువురు ఆయా సంఘాల తరపున పోటీ చేస్తుండటంతో కొందరు స్వతంత్రంగానే బరిలో నిలిచినట్లు తెలుస్తోంది. అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేయనున్నారు. మార్చి 3న ఫలితాలు వెలువడనున్నాయి.



నిర్మల్ జిల్లా కేంద్రం నుండి ఎన్నికల విధులకు బయల్దేరుతున్న ఉద్యోగులు

జిల్లా	కేంద్రాలు	పట్టభద్రులు	ఉపాధ్యాయులు	మొత్తం
ఆదిలాబాద్	39	14935	1593	16528
నిర్మల్	46	17141	1966	19107
కుమురంభీం	17	2315	1689	6607
మంచిర్యాల	58	30,841	1624	32465



ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



ఎన్నికల సిబ్బందికి సామాగ్రి పంపిణీ కేంద్రంలో నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

గోదావరి స్నానాకెళ్లి గల్లంతు

నవతెలంగాణ-జైపూర్

కోటపల్లి మండలం ఎర్రాయిపేట్ శివారు గోదావరి నది స్నానానికెళ్లిన రాదండి రాజేశ్(50) మడుగులో మునిగి గల్లంతయ్యాడు. బుధవారం మహాశివరాత్రి సందర్భంగా గ్రామ దేవతలను గోదావరి నదీ స్నానానికి తరలించారు. రాజేష్ గ్రామస్థులతో కలిసి గోదావరికి వెళ్లాడు. ఈ క్రమంలో ఆయన నీటి మడుగులో మునిగినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. మహాశివరాత్రి రోజున నదిలో మునిగిపోవడంతో గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. రాజేష్ కోసం పోలీసుల పర్యవేక్షణలో గాలింపు చర్యలు చేపట్టారు. ఆయనకు భార్య రేవతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కదిలి పాప హరేశ్వర ఆలయంలో కలెక్టర్ పూజలు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



మహాశివరాత్రి సందర్భంగా దిలావర్‌పూర్ మండలం కదిలి పాప హరేశ్వర ఆలయాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్ కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. స్వామివారికి, అన్నపూర్ణేశ్వరి దేవికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ రాజేష్ మీనా ఆలయాన్ని దర్శించి పూజలు నిర్వహించారు. కలెక్టర్, ఎస్పీ, ఏఎస్పీని ఆలయ ఈవో భూమయ్య, చైర్మన్ వెంకట్‌రావు, అర్చకులు సత్కరించారు.

అక్రమంగా తరలిస్తున్న ఫర్నీచర్ పట్టివేత

నవతెలంగాణ-కడెం



వడ్ల సంచుల మాటున అక్రమంగా ఫర్నీచర్ తరలిస్తున్న వాహనాన్ని అటవీ అధికారులు బుధవారం పట్టుకున్నారు. అటవీ అధికారుల వివరాల ప్రకారం..మండలంలోని గంగాపూర్ నుండి ట్రాక్టర్‌లో వడ్ల సంచుల్లో టేకు సోఫా సెట్, బెడ్స్, డ్రెస్సింగ్, డైనింగ్ టేబుల్‌ను విడిగా చేసి తరలిస్తున్నట్లు అందిన పక్కా సమాచారం మేరకు తనిఖీలు చేపట్టి వాహనాన్ని పట్టుకున్నారు. పట్టుకున్న ఫర్నీచర్ విలువ రూ.40వేల వరకు ఉంటుందని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. కలప అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని ఎఫ్ఆర్ఓ గీతారాణి హెచ్చరించారు. ఇందులో సెక్షన్ ఆఫీసర్ పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని రుయ్యాడికి చెందిన జువ్వాక పవన్‌కుమార్(27) మద్యానికి బానిసై మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పవన్‌కుమార్ ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు విభాగంలో ప్రైవేటు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 23న జిల్లా కేంద్రంలోని బంధువుల ఇంటికి వెళ్లి రాత్రి అక్కడే ఉన్నాడు. 25న గ్రామ శివారులోని తన చేనులో చెట్టుకు ఉరేసుకున్నాడు. మర్నాడు ఉదయం చేను పనులకు వెళ్లిన తండ్రి నర్సింగ్‌కు ఉరేసుకొని ఉన్న కుమారుడిని చూసి గ్రామస్తులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతికి గల కారణాలను కుటుంబీకులను అడిగి తెలుసుకున్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బావిలో దూకి వృద్ధుడి ఆత్మహత్య

నవతెలంగాణ-కడెం



మద్యానికి ఇంట్లో డబ్బులు ఇవ్వడంలేదని క్షణికావేశంలో వృద్ధుడు వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన బుధవారం మండలంలోని పాతమద్దిపడగలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని పాత మద్దిపడగ గ్రామానికి చెందిన బాతెం నర్సయ్య(67) మద్యానికి బానిసయ్యాడు. తాగడానికి ఇంట్లో డబ్బులు ఇవ్వడం లేదని మనస్థాపం చెంది గ్రామ సమీప వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం మేరకు సంఘటన స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టంకు తరలించారు. మృతుని భార్య రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



నవతెలంగాణ-మందమర్రి

బదిలీపై కొత్తగూడెం జీఎంగా వెళుతున్న కెకె గ్రూప్ ఏజెంట్ వి.రామదాసును బుధవారం ఏఐటీయూసీ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్, బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ సోమిశెట్టి రాజేశం, ఫిట్ సెక్రటరీ గాండ్ల సంపత్, మైనింగ్ స్టాఫ్ ఫిట్ సెక్రటరీ బానోత్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

నవతెలంగాణ-మందమర్రి



శ్రీపతినగర్‌కు చెందిన వేల్పుల సురేందర్(35) అనుమానాస్పద స్థితిలో మతి చెందినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. మృతుడికి మూడేండ్ల క్రితం గుండె సంబంధిత సర్జరి జరిగింది. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో కిందపడిపోయి ఉన్నాడు. గుండెపోటుతో మృతి చెందాడా, లేక మరేదైనా కారణంతో మరణించాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

పొరపాట్లకు తావివ్వకుండా విధులు నిర్వర్తించాలి

- ఆదిలాబాద్ అదనపు ఎస్పీ సురేందర్‌రావ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా విధులు నిర్వర్తించాలని అదనపు ఎస్పీ సురేందర్‌రావు అన్నారు. బుధవారం టీటీడీసీలో పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధారణ ఎన్నికల మాదిరి విధులు, నిబంధనలుంటాయని, ఓటర్ల సంఖ్యలో మాత్రమే వ్యత్యాసం ఉంటుందని పేర్కొన్నారు. పోలింగ్ రోజు ఉదయం నుంచి పోలింగ్ పూర్తై బ్యాలెట్ బాక్సులను తరలించే వరకు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. 400 మంది పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో అప్రమత్తంగా ఉంటూ విధులు చేపట్టాలని సూచించారు. కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇంక్, పెన్నులు వెళ్లకుండా చూడాలన్నారు. ఎన్నికల సిబ్బంది వద్ద కూడా ప్రభుత్వం అందించిన సామాగ్రి మాత్రమే ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు జీవన్‌రెడ్డి, శ్రీనివాస్, సీఐలు కరుణాకర్‌రావ్, సునీల్ కుమార్, ఫణిదర్, ప్రణయ్ ఉన్నారు.



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ సురేందర్‌రావ్

శివ్వారం మొసళ్ల అభయారణ్యంలో పెద్దపులి

- సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : అధికారులు



నవతెలంగాణ-జైపూర్

నిన్నటి వరకు కుందారం-పౌనూర్ ఏరియాల్లో తిరుగుతుందనుకున్న పెద్దపులి శివ్వారం మొసళ్ల అభయారణ్యానికి చేరుకుంది. మొసళ్ల అభయారణ్యం రోడ్డులో బుధవారం పెద్దపులి పాద ముద్రలను అటవీ అధికారులు గుర్తించారు. ఐదు రోజుల క్రితం భీమారం మండలం దాంపూర్ ఏరియాకు వచ్చిన పెద్దపులి మరునాడు జైపూర్ ఏరియా కుందారం చేరుకుంది. అక్కడి నుండి నేరుగా శివ్వారం మొసళ్ల అభయారణ్యంలో తిరిగుతున్నట్టు తెలుస్తోంది. పెద్దపులి సంచరిస్తున్నందున రైతులు, పశువుల కాపర్లు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. రైతులు అటవీ సరిహద్దు పంట పొలాల వైపు వెళ్లకుండా ఉండాలని సూచిస్తున్నారు. మండలంలో తిరుగుతున్న పెద్దపులి కదలికలను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి హానీ కలగకుండా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

పారిశుధ్య పనులు నిరంతరంగా కొనసాగాలి

- ప్లాస్టిక్ ఎక్కడా కన్పించొద్దు : డీపీఓ వెంకటేశ్వర్‌రావు



నవతెలంగాణ-జైపూర్

జాతర సందర్భంగా భక్తులు భారీగా తరలివస్తున్న దృష్ట్యా పారిశుధ్య పనులు నిరంతరంగా కొనసాగాలని డీపీఓ వెంకటేశ్వర్‌రావు ఆదేశించారు. ఎంపీఓ శ్రీపతి బాపు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి విద్యాసాగర్‌తో కలిసి బుధవారం వేలాలలో గ్రామ పంచాయతీ సిబ్బందికి పనులు పురమాయించారు. అదేవిధంగా గోదావరి స్నానఘట్టాల ఏరియా గట్టుమల్లన్న గుట్ట ప్రాంతంలో పర్యటించి పారిశుధ్య పనుల నిర్వహణను పర్యవేక్షించారు. అదేవిధంగా ప్లాస్టిక్ నిషేధించినందున ఎక్కడ కూడా ప్లాస్టిక్ కన్పించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భక్తులు ప్లాస్టిక్ వస్తువులు వాడకుండా స్టీల్, ఇత్తడి పాత్రలు వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాకేష్, జైపూర్, భీమారం మండలాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘన్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద మద్యం పట్టివేత



నవతెలంగాణ-బోథ్

మండలంలోని ఘన్‌పూర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ జుల్ఫీకర్ అహ్మద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..మహారాష్ట్ర సరిహద్దున గల చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా బోథ్‌కు చెందిన జోగు ప్రవీణ్, నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లికి చెందిన కట్కం నరేష్ బుధవారం మహారాష్ట్రకు చెందిన నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ తీసుకొస్తున్నారు. వారి వద్ద పట్టుకున్న మద్యం విలువ సుమారు రూ.14,400 ఉంటుంది. మహారాష్ట్రకు చెందిన లిక్కర్ తీసుకొచ్చి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

300 దేశీదారు బాటిళ్ల పట్టివేత

నవతెలంగాణ-కాగజ్‌నగర్



మహారాష్ట్ర నుండి కాగజ్‌నగర్ పట్టణానికి సరఫరా చేస్తున్న దేశీదారు మద్యం బాటిళ్లను బుధవారం ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. పట్టణ శివారులో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపడుతుండగా స్కూటీ వాహనంలో తరలిస్తున్న 300 దేశీదారు మద్యం (90) బాటిళ్లు లభ్యమయ్యాయి. వీటిని రవాణా చేస్తున్న పట్టణానికి చెందిన అబ్దుల్ సొహైల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వి రవి తెలిపారు. ఈ తనిఖీలలో ఎస్ఐలు లోభానంద్, సురేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నట్లు సీఐ వివరించారు.

గాయాల పాలైన వ్యక్తి మృతి

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాగూడ గ్రామం వద్ద ఈ నెల 19న జరిగిన రోడ్డు ప్రమాదం విదితమే. దీనిలో తీవ్రంగా గాయపడిన మడావి రాంషావ్(50)ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: ఇచ్చోడకు చెందిన 50 ఏండ్ల అన్నెల లక్ష్మణ్ అనారోగ్యంతో ఈనెల 21న జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చేరాడు. బుధవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో తన భార్యను నెట్టేసి ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లిపోయాడు. సాయంత్రం వరకు కూడా తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హెడ్ కానిస్టేబుల్ మధన్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | ఫిబ్రవరి 27, 2025 | www.navatelangana.com

నేడు పట్టణంలో 163 సెక్షన్ అమలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల నేపథ్యంలో భారతీయ నాగరిక సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) 163 సెక్షన్ అమలులో ఉంటుందని కలెక్టర్ రాజర్షి షా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్సైజ్ చట్టంలో అందించిన అన్ని పరిమితులు తీవ్రంగా అమలు చేయబడతాయని తెలిపారు. ఎన్నికల బూత్‌ను ఏర్పాటు చేయడం, పోలింగ్ స్టేషన్ సమీపంలో ప్రచారం చేయడం, మొబైల్ ఫోన్లు, కార్డ్‌లెస్ ఫోన్‌ల వినియోగం, పోలింగ్ స్టేషన్‌ల దగ్గర ఆయుధాలతో వెళ్లడం, వాహనాలపై వెళ్లడం తదితరాలపై ఆంక్షలు ఉంటాయన్నారు. రవాణ కోసం ఉపయోగించే ఏ రకమైన వాహనం ద్వారానైనా ఓటరును పోలింగ్ స్టేషన్‌కు లేదా బయటికి తీసుకెళ్లడానికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఏర్పాట్లు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. పోలింగ్ ప్రాంతంలో ఎన్నికల కోసం పోలింగ్ ముగిసే వరకు 5 మంది కంటే ఎక్కువ మంది వ్యక్తులు ఏ పోలింగ్ ప్రాంతంలో ఉండటాన్ని నిషేధిస్తూ ఆంక్షలు జారీ చేయబడ్డాయని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేను కలిసి గ్రామస్తులు

నవతెలంగాణ-నేరడిగొండ



బజార్‌హత్నూర్ మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన హారకయి గ్రామస్తులు మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్‌ని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువతో సన్మానించి పలు సమస్యలను ఆయనకు విన్నవించారు. అనంతరం గుడిహత్నూర్ మండలంలోని దామన్‌గూడ గ్రామస్తులు కలిసి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. వీటిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ మారుములా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేల చూస్తామన్నారు.

నేడు ఎమ్మెల్సీ పోలింగ్.. ఏర్పాట్లు పూర్తి

- 39 పోలింగ్ కేంద్రాలు, 16,528 మంది ఓటర్లు



ఆదిలాబాద్ : బ్యాలెట్ పత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. బుధవారం టీటీడీసీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. ఎన్నికల సామాగ్రిని సిబ్బందికి అందించి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వసతులను సరి చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎన్నికలకు నియమించిన సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎలాంటి పొరపట్లకు తావులేకుండా చూసుకోవాలన్నారు. పీఓ, ఏపీఓలకు ఇప్పటికే రెండు దఫాల శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. సిబ్బందికి ఆరు రూట్లు కేటాయించమని, వాహనాలకు జీపీఎస్ పెట్టామన్నారు. పోలింగ్ అనంతరం అక్కడి నుంచి నేరుగా కరీంనగర్‌కు బ్యాలెట్ బాక్సులను తరలిస్తామన్నారు. పోలింగ్ స్టేషన్‌ల వారీగా ఎన్నికల సామాగ్రి పంపిణీకి కౌంటర్లు ఏర్పాటు చేసి పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో తాగునీరు, భోజన వసతి కల్పించడం జరిగిందని, ఎన్నికల సిబ్బంది సామాగ్రితో వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్‌కు వెళ్లేందుకు వాహనాలు ఏర్పాటు చేశామన్నారు. బ్యాలెట్ బాక్స్‌లు తరలించేందుకు 6 క్లోస్డ్ బాడి వెహికల్స్‌లో జీపీఎస్ డివైస్ అమర్చడం జరిగిందని దీనివలన వెహికల్స్ గమ్యమార్గంలో ఎక్కడ ఉన్నాయో తెలుస్తుందని పేర్కొన్నారు.

ఉదయం 8 నుండి 4 వరకు పోలింగ్

ఈనెల 27 న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలు, ప్రభుత్వ ఎన్నికల సంఘం ఆదేశాలు, సూచనల మేరకు పక్కాగా అమలు చేస్తూ ఎన్నికల నిర్వహణకు సిద్ధమైనట్లు తెలిపారు. జిల్లాలో 11418 మంది పురుషులు 5110 మంది మహిళలు మొత్తం 16,528 మంది ఓటర్లు వారి హక్కును వినియోగించేల 30 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు ఎన్నికల కేంద్రాలలో సీసీ కెమెరాలు, తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్, పారిశుధ్యం తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. రవాణ, భద్రత, వైద్య, తదితర సౌకర్యాలు కల్పించామన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ వినోద్ కుమార్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ : ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ శాసన మండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల నిర్వహణకు సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిలాష అభినవ్ సందర్శించారు. ఎన్నికల పంపిణీ కేంద్రంలో ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రూట్ల వారిగా ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాలను పరిశీలించి ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన సిబ్బందికి సూచనలు చేశారు. ఎన్నికల అధికారులు పోలింగ్ సామాగ్రిని ఒకటికి రెండుసార్లు జాగ్రత్తగా సరిచూసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణిత సమయానికి పోలింగ్ కేంద్రానికి చేరుకొని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వసతులను సరి చూడాలన్నారు. పోలింగ్ కేంద్రంలో ఏజెంట్లకు, సిబ్బందికి సెల్ ఫోన్లు అనుమతి లేదన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల వివరాలు, ఓటర్లకు సూచనలు తెలిపేలా పోస్టర్లను అతికించాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే పై అధికారులకు సమాచారం అందివ్వాలన్నారు. జిల్లాలో 46 పోలింగ్ కేంద్రాలలో గురువారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ఓటింగ్ కొనసాగుతుందని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కలిగి ఉన్న ప్రతి ఓటరు ప్రలోభాలకు గురి కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అదనపు ఎస్పీలు రాజేష్ మీనా, ఉపేంద్ర రెడ్డి, ఆర్డీఓలు రత్నాకళ్యాణి, కోమల్ రెడ్డి, రిటర్నింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



నిర్మల్ : డిస్ట్రిబ్యూటర్ సెంటర్‌లో ఎన్నికల అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రధానమంత్రితో ప్రశంస పొందడం గర్వకారణం : కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏఐ ద్వారా పాటలు బోధిస్తు ప్రధానమంత్రితో ప్రశంసలు పొందడం జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఇటీవల మన్ కీ బాత్‌లో ఇంద్రవెల్లి మండలం గౌరపూర్ ఎంపీయూపీఎస్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యక్షుడు తోడం కైలాస్ గురించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రస్తావించి ప్రశంసించారు. ఆర్టిఫియల్ ఇంటలిజెన్స్‌తో మారుమూల గ్రామాల్లో ఆదివాసులకు పాఠాలు బోధించడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా కృతిమ మేధా ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను కైలాస్ కలెక్టర్‌కు వివరించారు. గిరిజన భాష అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను తెలుసుకున్న కలెక్టర్ ఆయనను అభినందించి శాలువతో సత్కరించారు. అదే విధంగా తోడసం కైలాస్ కలెక్టర్‌పై తెలుగులో రాసిన పాటను మ్యూజిక్‌ను అందించి రిలీజ్ చేయించారు. కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, ఉపాధ్యాయులు అజయ్, రమేష్ బాబు, కైలాస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రారంభమైన సేవాలాల్ దీక్షలు

- మహా శివరాత్రి నుండి 41 రోజుల మాలధారణ
- దీక్షభూమిలో 286వ సేవాలాల్ జయంతి ఉత్సవాలు



నవతెలంగాణ-నార్నూర్

మహాశివరాత్రితో బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ దీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం కొత్తపల్లి(హెచ్) దీక్ష భూమిలో దీక్షపరులు 41 రోజుల పాటు చేపట్టే దీక్షను పీఠాధిపతి ప్రేమ్‌సింగ్ మహారాజ్ చేతుల మీదుగా స్వీకరించారు. ఈ సందర్భంగా మహారాజ్ మాట్లాడుతూ మహాశివరాత్రి నుంచి దీక్షలు ప్రారంభమై రామనవమి వరకు కొనసాగుతాయన్నారు. 1980 నుంచి ఈ ఆనవాయితీ కొనసాగుతూ వస్తోందన్నారు. సమయానుకూలతను బట్టి 41, 21, 11 రోజులుగా దీక్ష చేపడతారన్నారు. దీక్షపరులు ధూమ, మద్యపానానికి దూరంగా, ఉపవాసం ఉంటూ ఒక పూట భోజనం చేస్తారని పేర్కొన్నారు.

ఇదీ నేపథ్యం..

దీక్ష గురు ప్రేమ్ సింగ్ మహరాజ్ 1978లో కెరమెరి మండలంలోని శంకర్‌లొద్దిలో మహా తపస్సు చేశారు. 1979 జనవరి 11న పౌరగఢ్ పీఠాధిపతి రామారావు మహరాజ్ తపస్సుని విరమింపజేశారు. నాటి నుంచి ఏటా జనవరి 11న గురుకప దినోత్సవంగా నిర్వహిస్తారు. అదే ఏడాది శివరాత్రి నుంచి సేవాలాల్ దీక్ష ప్రారంభమైంది. దీక్షగురు లంబాడీలను చెడుమార్గాల నుంచి దూరం చేస్తూ ఏకతాటిపైకి తీసుకురావడానికి వివిధ రాష్ట్రాల్లో తిరిగి ఆధ్యాత్మిక చైతన్యం కల్పించారు.

నేడు హజ్ యాత్రికులకు శిక్షణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాకు చెందిన ఎంపిక చేసిన హజ్ యాత్రికుల కోసం మొదటి శిక్షణ శిబిరాన్ని గురువారం నిర్వహిస్తున్నట్టు హజ్ సొసైటీ జిల్లా ఆదిలాబాద్ ప్రెసిడెంట్ ముహమ్మద్ షాహిద్ అహ్మద్ తవకల్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవనంలో గురువారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9849214764, 9394354477 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

చదువుల కోసం రూ.50 వేల ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసీ ఉద్యమకారుడు ఉయిక సంజీవ్ ఇటీవల మరణించగా ఆయన కుమార్తే ఉయిక ప్రియాంక చదువులకు వెడ్మ ఫౌండేషన్ ద్వార రూ. 50వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఫౌండేషన్ వ్యస్థాపకుడు, ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ విద్యార్థికి నగదును అందించి ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులున్నారు.

నేడు ప్రభుత్వ విద్యాసంస్థలకు సెలవు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎన్నికల దృష్ట్యా గురువారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి, సంబంధిత జిల్లా స్థాయి అధికారులందరూ దీనికి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా విద్యాసంస్థల యజమానులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

400 మంది పోలీసులతో బందోబస్తు

- డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఏర్పాట్ల పరిశీలన
- పోలింగ్ కేంద్రాల వద్ద 163,144 సెక్షన్ అమలు
- ఎస్పీ గౌస్ ఆలం



బందోబస్తు వివరాలను తెలుసుకుంటున్న ఎస్పీ గౌస్ ఆలం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 27న జరిగే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 400 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. బుధవారం టీటీడీసీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించి అధికారులు, సిబ్బందికి సూచనలుచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా వ్యాప్తంగా ఉన్న 20 పోలింగ్ లొకేషన్లు, 39 పోలింగ్ స్టేషన్‌లో ప్రత్యేకంగా 8 రూట్లలో ఏర్పాటు చేసిన మొబైల్ రూట్ పార్టీలు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్, క్యూఆర్టీ స్ట్రైకింగ్ ఫోర్స్, ఇద్దరు డీఎస్పీ ఆధ్వర్యంలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లను, ప్రత్యేకంగా జిల్లావ్యాప్తంగా నిఘా బృందాలను ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తి అయ్యే విధంగా బందోబస్తు ప్రక్రియను పూర్తి చేసినట్లు సిబ్బందికి విధులను కేటాయించినట్లు తెలియజేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ యాక్ట్ (సెక్షన్ 144) అమలులో ఉంటుందని, 100 మీటర్ల 200 మీటర్ల పరిధిలో ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన గొడవలు సృష్టించడానికి చూస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులు గుంపులుగా తిరగడం పార్టీ జెండాలను పార్టీ గుర్తులను ధరించి లోపలికి వెళ్లడం ప్రదర్శించడం లాంటివి చేయకూడదని తెలియజేశారు. మొబైల్ ఫోన్లు ఎలక్ట్రానిక్ వస్తువులకు పోలింగ్ కేంద్రంలోనికి అనుమతి లేదన్నారు. తెలియజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్ రావ్, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్ రెడ్డి, సీఐలు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ పట్టణవ్యాప్తంగా మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రసిద్ధ శైవ క్షేత్రాల్లో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తి ప్రపత్తుల నడుమ చేపట్టారు. మహా శివరాత్రి పండగ సందర్భంగా శివాలయాలను అందంగా ముస్తాబు చేయగా...ఆ భోలా శంకరుడిని ప్రత్యేక పూజలతో భక్తులు ఆరాధించారు. అందులో భాగంగానే పట్టణంలోని గంగాపుత్ర శివాలయంలో మహా శివరాత్రిని పురస్కరించుకుని ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో జరిపారు. శివరాత్రి సందర్భంగా ఆలయాన్ని అందంగా ముస్తాబు చేయగా..ఉదయం నుండే వివిధ ఆధ్యాత్మిక క్రతువులను నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఒకరోజు ముందే శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. భారీ ఎత్తున తరలివచ్చిన భక్తులు పరమశివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పూజాది క్రతువులు, అభిషేకాలు నిర్వహించారు. ఆ పరమ శివుడిని దర్శించుకోవడానికి ఉదయం నుంచే భక్తులు క్యూలైన్లు కట్టారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ఆదిలాబాద్ రూరల్ : మావల, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పొచ్చెర దిమ్మె, అంకోలి, అనుకుంట, భీంసరి, లాండ సాంగి, అంకాపూర్, శివఘాట్, న్యూ రాంపూర్, రామాయి, చాందా(టి), వాన్‌వాట్, పిప్పల్‌దరి, లోకారి, బట్టి సవర్గం, తంతోలి, యాపాల్ గూడ గ్రామాల్లో బుధవారం మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి అన్నారు.గ్రామంలో నెలకొని ఉన్న శ్రీ ఏక బిలేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి పురస్కరించుకొని వేడుకలను అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ గంద్రత్ రమేష్, భూమయ్య, జయంత్, రోషన్, నారాయణ, జైరాం, లింగు, గంగారెడ్డి, కిష్టయ్య, వివిధ గ్రామస్తులు పాల్గొన్నారు.

శివుని విగ్రహ ఆవిష్కరణ

మండలంలోని భీంసరి గ్రామంలోని మాజీ ఎంపీటీసీ బిక్కి గంగాధర్ తన సొంత నిధులతో శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి బుధవారం ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి పండగ పర్వదినాన గ్రామంలో స్మశానవటికలో అంగరంగ వైభవంగా శివుని విగ్రహ ఆవిష్కరణ జరిగిందన్నారు. అనంతరం గ్రామస్తులు మాజీ ఎంపీటీసీని అభినందించారు.

బేల : మండలంలోని బాది గ్రామంలో గల పురాతనమైన ఆలయాల్లో బాది నందేశ్వర ఆలయం ఒకటి. ఈ ఆలయంలోని దేవత మూర్తులు శివలింగం, నందేశ్వరుడు కొలవై ఉన్నారు. ఇవి నల్ల రాతితో నిర్మించడంతో శాతవాహనుల కళావైభవాన్ని గుర్తుకు వస్తాయి. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా జూగ్నక్ వంశస్థులు సంస్కృతి సాంప్రదాయం ప్రకారం ఆచార వ్యవహారాలకు పెద్దపీట వేసే ఆదివాసులు నియామనిష్టాలతో పూజలు చేస్తారు. జాతర ప్రారంభనికి ముందే జూగ్నక్ వంశస్థులు చిన్నచిన్న గుడెరాలను ఏర్పాటు చేసి వారు ఎక్కడున్నా ఇక్కడ అందరు కలుసుకుని వంటవార్పు చేస్తారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ జాతరకు ఆదివాసీ గిరిజనులతో పాటు ఆదిలాబాద్, మహారాష్ట్ర సరిహద్దుల గ్రామాల భక్తులు భారీగా తరలివస్తారు.ఆలయాన్ని సందర్శించే భక్తులకు అన్ని సదుపాయలను ఆలయ కమిటీ సభ్యులు కల్పించారు.

శివలింగ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

జైనథ్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని స్వగ్రామం ఆడలో గల శివాలయాన్ని ఎమ్మెల్యే పాయల్ శంకర్ కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. మొదటగా ఆలయ కమిటి సభ్యులు, నిర్వాహకులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి పరమ శివుడిని కొలిచారు. అంతకు ముందు గ్రామంలో నిర్వహించిన పల్లకి సేవలో పాల్గొన్నారు.

కుభీర్ : మండల కేంద్రంర్‌తో పాటు పార్డి(బి) పల్సి, సోనారి నిగ్వ గ్రామాల్లో బుధవారం శివరత్రి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్డి(బి) గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వర ఆలయం, పంగర్ ఫాడ్‌లోని జట శంకరుడు ఆలయానికి ఆయా గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వరునికి భక్తులు అభిషేకలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. ఆలయనికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఇంద్రవెల్లి : మహాశివరాత్రిని పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో మార్మోగాయి. మండల భక్తులు కేస్లాపూర్ నాగోబా మందిరంతో పాటు గుడిహత్నూర్, ఉట్నూర్ మండలం సాలేవాడ శివాలయాలకు తరలివెళ్లారు. దీంతో ఎక్కడ చూసినా శివాలయ మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. దర్శనం కోసం బారులు తీరారు. దినమంతా కఠిన ఉపవాస దీక్షను చేపట్టారు.

నార్నూర్ : మహాశివరాత్రి వేడుకలను బుధవారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఉపవాసం చేపట్టి శివ నామస్మరణ చేశారు. గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. భక్తులతో శివాలయ ఆలయాలు కిటకిట లాడాయి.

బోథ్ : మండలంలోని నిగ్ని గ్రామపంచాయతీ పరిదిలోని కైలాష్ టేకిడిలో బుధవారం మహాశివరాత్రి పురస్కరించుకొని నర్మదేశ్వరుడి పూజలను ఘనంగా నిర్వహించారు. అలాగే ఆలయంలోని కొలువు దీరిన శివుడుకు పూజలు చేశారు. అలాగే మండలంలోని బోథ్, సొనాలలో భక్తులు శివుడిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో లింబా మహారాజ్, పూజారి పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండలంలోని ధనిగోపాల్‌పేట్ అటవీ ప్రాంతంలో గల ప్రాచీన రాజరాజేశ్వర ఆలయాన్ని బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ దర్శించుకున్నారు. శివలింగానికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వడ్డె రాజేందర్‌రెడ్డి, కర్పె విలాస్‌రెడ్డి, బడి పోతన్న, సాదు రాంరెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

ఉట్నూర్ : మండలంలోని సాలేవాడ(బి) గ్రామంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సతీమణి ధృపత, కుమారుడు నీతిష్ పటేల్‌తో కలిసి శివాలయంలో శివలింగానికి దర్శించుకున్నారు. అనంతరం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బోలా శంకరుడి ప్రేమ, దయ, కరుణ కటాక్షాలు ఎల్లప్పుడు సకల జగతిపై ఉండాలని, పాడి పంటలు బాగా పండి, ప్రపంచమంతా సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దంపతులను శాలుతోతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, భక్తులు, గ్రామస్తులున్నారు.

దస్తురాబాద్ : మండలంలోని గొడిసెర్యాల శ్రీ రాజరాజేశ్వర ఆలయం బుధవారం భక్తులతో కిటకిటాలడింది. మహా శివరాత్రి పర్వదిన సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకొని మొక్కులను తీర్చుకున్నారు. ఆలయంలో రాత్రి సమయంలో శివ పార్వతుల కల్యాణ ఉత్సవాన్ని ఆలయ అర్చకుడు లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో అంగరంగా వైభవంగా నిర్వహించానున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దస్తురాబాద్ ఎస్సై శంకర్ ఆధ్వర్యంలో కడెం, పెంబి, దస్తురాబాద్ పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు లక్ష్మణస్వామి తెలిపారు. అర్ధరాత్రి ఆలయ గర్భగుడిలో నాగుపాము ప్రత్యక్షమై భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ మహా కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా ఆలయం వద్ద వేచిచూస్తున్నారు. అలాగే రేవోజీపేట గ్రామంలో అర్చకులు వోద్దిపర్తి వంశీకృష్ణ ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. స్వయంగా భక్తులు శివునికి అభిషేకం చేశారు.

నిర్మల్‌రూరల్ : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓంకారేశ్వర ఆలయంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వాగతం పలికి శాలువాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. మాజీ కౌన్సిలర్ లక్కాకుల నరహరి, సంతోష్, ప్రవీణ్ కుమార్, రవి పాల్గొన్నారు.





ముసలమ్మ గుట్ట శివాలయాన్ని దర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండలంలోని కర్జెల్లి ముసలమ్మ గుట్టపై మహాశివరాత్రి సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరమేశ్వరుని కృప వలన ప్రాంతం సుభిక్షంగా ఉండాలని, ఆయురారోగ్యాలతో, పిల్లా పాపలు, పాడి పంటలతో బాగుండాలని ప్రార్థించారు. ఈ జాతర మహోత్సవంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ మల్లయ్య, ఆలయ కమిటీ చైర్మన్ చౌదరి లక్ష్మణ్, మండల అధ్యక్షులు రామన్న, నాయకులు నానయ్య, రంగన్న, మురళి, సుధాకర్, పురుషోత్తం చారి, నానాజీ, భీమేష్, మోహన్ పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-వాంకిడి



మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని మండలకేంద్రంలోని శివకేశవ ఆలయం వద్ద జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చి మొక్కలను తీర్చుకున్నారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రశాంత్ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గాదే దినకర్ తెలిపారు.

చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగల అరెస్ట్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలో గత కొన్ని రోజులుగా చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను బుధవారం అరెస్ట్ చేసినట్లు టౌన్ సీఐ పి రాజేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గాజియాబాద్ జిల్లా సోదుల్లాబాద్ బుద్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఖలీల్, షేక్ ఖాలిద్‌లు చిల్లర దొంగతనాలకు పాల్పడుతూ జీవనం సాగిస్తున్నారు. వీరు ఈ నెల 24వ తేదీ రాత్రి హైద్రాబాద్ నుండి కాగజ్‌నగర్‌కు వచ్చి స్థానిక ఎన్టీఆర్ చౌక్‌లో గుర్తు తెలియని వ్యక్తికి చెందిన స్కూటీ తీసుకొని అదే రోజు రాత్రి 11 గంటల సమయం నుండి తెల్లవారుజాము 3-30 గంటల వరకు సీతాపతినగర్, బాలాజీనగర్, పెట్రోల్‌పంప్ ఏరియాలలో చోరీకి పాల్పడ్డారు. బాలాజీనగర్‌లోని ఇంటిలో దొంగతనానికి ప్రయత్నిస్తుండగా పోలీసు సైరన్ విని పారిపోయారు. ఇది ఆ ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలో రికార్డ్ కాగా పోలీసులు రాత్రి సమయాలలో పెట్రోలింగ్ పెంచారు. 26వ తేదీ ఉదయం ఆరు గంటలకు స్థానిక ఎన్టీఆర్ చౌక్‌లో వీరు పోలీసులకు తారసపడగా పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని చుట్టుముట్టి పట్టుకున్నారు. వీరి నుండి స్కూటీ (నెం. ఎపి29జె1011) తో పాటు రూ. 79 వేల విలువైన 88.30 తులాల వెండి వస్తువులు, రూ. 3,700తో పాటు చోరీకి ఉపయోగించే సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. ఈ దొంగలను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన కానిస్టేబుళ్ల రాజు, సంపత్, వెంకటేష్‌ను డీఎస్పీ బి రామానుజం అభినందించారు.

అప్రమత్తంగా ఉండాలి

ఇళ్ల యాజమానులు ఊరికి వెళితే పోలీసులకు సమాచారం ఇచ్చి వెళ్లాలని సీఐ రాజేంద్రప్రసాద్ సూచించారు. ప్రతీ ఇంటి యాజమాని తమ ఇంటి వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని అన్నారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లనే దొంగలు లక్ష్యంగా పెట్టుకొని చోరీలకు పాల్పడుతున్నందున యాజమానులు ఊళ్లకు వెళ్లిన సమయంలో విలువైన వస్తువులను ఇళ్లల్లో ఉంచరాదని సూచించారు.



దొంగల నుండి స్వాధీనం చేసుకున్న వస్తువులు

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ భుమేశ్వర్ తెలిపారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రంలో ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఓటర్లు 13 మంది, పట్టభద్రులు 317 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 330 మంది కేంద్రంలో ఓటు కలిగి ఉన్నారని తెలిపారు. కాగా పోలింగ్ సిబ్బంది బుధవారం బెజ్జూరుకు చేరుకుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పెంచికల్‌పేట్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నికలకు పోలింగ్ బూత్ వద్ద అన్ని ఏర్పాట్లను చేశారు. పెంచికల్‌పేట్ మండలంలో ఉన్న పోలింగ్ కేంద్రంలో పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు కోరారు. బుధవారం సాయంత్రం సిబ్బంది కేంద్రానికి చేరుకున్నారు.



ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేడు జరగనున్న మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల పోలింగ్‌లో జిల్లాలో అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన కార్యాలయాలు, సంస్థలకు ఈ నెల 27న పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు కాగా, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాలలు, సంస్థలకు సెలవు ప్రకటించడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్క ఓటరు తమహక్కును వినియోగించుకోవాలని సూచించారు.

రూ.21 లక్షల విలువైన మద్యం సీజ్

- ముగ్గురిపై కేసు నమోదు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ



విలేకరుల సమావేశంలో వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ రామానుజం

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల పరిధిలోని గూడెం గ్రామంలో అక్రమంగా పెద్ద ఎత్తున నిల్వ ఉంచిన మద్యాన్ని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రామానుజం వివరాలు వెల్లడించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మద్యాన్ని నిల్వ ఉంచినట్టు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు గూడెం గ్రామంలో బెల్ట్ షాప్‌లు, ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు రామగిరి శంకర్ వద్ద రూ.98,400, కుశతురివారి ఆకాశ వద్ద రూ.19,200, సంతోష్ జై స్వాల్ వద్ద రూ.9,130, మొత్తం గ్రామంలో రూ.21,50,890 విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఎలక్షన్ కోడ్ అమల్లో ఉండగా అక్రమ లాభార్జనకు మద్యం అమ్మిన వ్యక్తులు, మద్యం షాప్ ఓనర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఎవరైనా ఎలక్షన్ నిబంధనలను అతిక్రమించి ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడిలో రూ.19.38లక్షల విలువైన 730 హేవార్డ్స్ 5000 బీర్లు, కింగ్ ఫిషర్ బీర్‌లు 100 బాటిల్ లు, రాయల్ స్టాక్ 100బాటిల్‌లు, ఐకోనోగ్ బాటిల్ 24, రాయల్ చాలెంజ్ 120 బాటిళ్లు, ఆఫీసర్ ఛాయిస్ 250 ఫుల్ బాటిల్స్, ఆఫీసర్ ఛాయిస్ 40 బాటిల్, అమెరికన్ ప్రైడ్ 40 బాటిళ్లు ఉన్నాయని వెల్లడించారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. అక్రమంగా మద్యం నిల్వ చేసినా, విక్రయించినా, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను ఆయన కోరారు. పెద్ద ఎత్తున మద్యం పట్టుకున్న ఏఎస్ఐ మను, కానిస్టేబుల్స్ విజయ్, తిరుపతి, హెడ్ కానిస్టేబుల్స్ దినకర్, మహేష్, ఆనంద్, టీజీఎస్పీ సిబ్బందిని, పోలీస్ అధికారులను ఎస్పీ అభినందించినారు. ఈ సమావేశంలో సీఐ ముత్యం రమేష్, చింతలమానేపల్లి, కౌటాల, బెజ్జూర్ ఎస్సైలు నరేష్, మధుకర్, ప్రవీణ్ ఉన్నారు.



పట్టుకున్న మద్యం వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ

డీసీసీ అధ్యక్షుడితో సహా పలువురిపై అట్రాసిటీ కేసు నమోదు..?

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌తో పాటు పలువురిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయినట్లు సమాచారం. గత సంవత్సరం నవంబర్ 2న స్థానిక రోజ్ గార్డెన్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కులగనన అభిప్రాయ సేకరణ చేయడానికి సమావేశం ఏర్పాటు చేశారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్యాంనాయక్ వర్గీయుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇరు వర్గాలు పరస్పర దాడులకు పాల్పడడంతో పాటు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా బుధవారం కేసు దర్యాప్తులో భాగంగా డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌తో పాటు కాంగ్రెస్ నాయకుడు అనిల్ గౌడ్, రమేష్, చరణ్, అసద్‌లపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయినట్లు తెలిసింది. ఇదే విషయం సీఐ రవీందర్‌ను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

ఘనంగా ఈజ్‌గాం శివమల్లన్న జాతర



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం గ్రామంలోని శ్రీ శివమల్లన్న స్వామి జాతర బుధవారం ఘనంగా జరిగింది. మహాశివరాత్రిని పురస్కరించుకొని ప్రతీ ఏటా ఈ జాతరను ఘనంగా నిర్వహిస్తారు. జాతర పురస్కరించుకొని ఉదయం నాలుగు గంటల నుండే భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. ఉదయం నాలుగు గంటలకు సుప్రభాత కార్యక్రమంతో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. నాలుగున్నరకు రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం 5 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు స్వామి దర్శన కార్యక్రమం చేపట్టారు. సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, తన తల్లి మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మితో కలిసి ఉదయం నాలుగు గంటలకే ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుండి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. సాయంత్రం 5 గంటలకు శ్రీ శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం రథోత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులకు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఎమ్మెల్సీ దండె విఠల్, బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు రావి శ్రీనివాస్‌లు అన్న ప్రసాదంతో పాటు పండ్ల రసాలు, మజ్జిగ, తాగునీరు అందించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి వేణుగోపాల్‌గుప్తా ఏర్పాట్లు చేపట్టారు. ఎస్పీ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో డివిజన్‌లోని పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు నిర్వహించారు.



ఎన్నికల విధులకు బయల్దేరిన సిబ్బంది

- కలెక్టరేట్‌లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం
- జెండా ఊపిన జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేడు జిల్లాలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి విధులు నిర్వహించే సిబ్బంది సామాగ్రితో బయలుదేరి వెళ్లారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. 17 పోలింగ్ కేంద్రాలలో 19 మంది పీఓలు, 87 ఏపీఓలు, 17 మంది మైక్రో అబ్జర్వర్లను కేటాయించగా వారికి ఎన్నికల కమిషన్ ఇచ్చిన సామాగ్రితో ప్రత్యేక బస్సుల్లో బయలుదేరి వెళ్లారు.



ఎన్నికల సిబ్బంది వాహనానికి జెండా ఊపి సాగనంపుతున్న కలెక్టర్



బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న ఎన్నికల సిబ్బంది

కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా సిబ్బందికి పలు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ నిర్వహణ అత్యంతం ప్రశాంతంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉంటుందన్నారు. ప్రతి విషయాన్ని కూలంకషంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఎన్నికల్లో ఎటువంటి తప్పులు చేయకుండా ఉండాలన్నారు. శిక్షణలో ఇచ్చిన ప్రతి అంశాన్ని విధి నిర్వహణలో పాటించాలన్నారు. అనంతరం ఎన్నికల విధులకు బయలుదేరిన సిబ్బంది బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ దత్తారావు, ఆర్డీఓ లోకేశ్వరరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

శివ నామస్మరణతో మార్మోగిన శివాలయాలు

- జిల్లావ్యాప్తంగా శివాలయాల్లో భక్తుల రద్దీ
- జాతరకు ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లాలోని శివాలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. ఉదయం 5 గంటల నుండి ఆలయాల్లో పూజారులు ప్రత్యేక పూజలు ప్రారంభించారు. శివుని దర్శనం చేసుకోవడానికి ఆయన కటాక్షం పొందడానికి ప్రతి ఆలయంలో వేల సంఖ్యలో భక్తులు బారులు తీరారు. జిల్లా కేంద్రంలోని సందీప్ నగర్‌లో గల శివాలయంలో శివ కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. జిల్లా కేంద్రంలోని ప్రజలు పెద్ద ఎత్తున శివ కళ్యాణానికి హాజరు కాగా ఎమ్మెల్యే కోవలక్ష్మి దంపతులు కల్యాణానికి హాజరై పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఉత్సవ విగ్రహాల భారీ ర్యాలీ నిర్వహించారు. అలాగే పెద్దవాగు ఒడ్డున గల బాలేశ్వర ఆలయం కూడా భక్తులతో కిటకిటలాడింది. మండలంలోని చిర్రకుంటలో నిర్వహించిన కల్యాణ వేడుకల్లో మాజీ ఎంపీపీ మల్లికార్జున్ పాల్గొన్నారు. బూరుగుడ గ్రామంలోని శివాలయంలో పూజారులు శిరీష్ శర్మ, మహేష్ ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గుండి, మొతుగూడ గ్రామాలలో ఉన్న శివాలయాలు ఉదయం నుండి రాత్రి వరకు భక్తులతో కిటకిటలాడాయి. బూరుగుడ శివాలయంలో శివ కళ్యాణం పల్లకి ఊరేగింపు రథోత్సవం అలరించింది. సందర్భంగా గుడి ఆవరణలో దుకాణ సముదాయాలు ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా శివ కల్యాణం నిర్వహించి బూరుగుడ ఆలయంలో నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు

ఆసిఫాబాద్ డిపో ఆర్టీసీ ఆధ్వర్యంలో వాంకిడి మండల కేంద్రంలో జరిగే జాతర, రెబ్బెన మండల నంబాలలో జరిగే కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్గాం ఆలయం, రెబ్బెన మండలం నంబాలలో జరిగిన మహా శివరాత్రి వేడుకలకు ఆర్టీసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం నుండి కాగజ్‌నగర్ నుండి ప్రత్యేక బస్సులు భక్తుల కోసం ఏర్పాటు చేశారు.

వేడుకల్లో పండ్ల పంపిణీ

జిల్లా కేంద్రంలోని సందీప్ నగర్ శివాలయంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆసిఫాబాద్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి పురస్కరించుకొని ఆలయం వద్ద భక్తులకు పండ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రాపర్తి శ్రావణ్, ఉపాధ్యక్షుడు విపిన్ లొద్దా, సెక్రెటరీ ఈదులవాడ కార్తీక్, ట్రెజరర్ రాపర్తి నవీన్, కమిటీ ఇన్‌చార్జి సిరికొండ శ్రావణ్, గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.



బెజ్జూర్ : మండల కేంద్రంలోని రంగనాయక దేవాలయ ప్రాంగణం శివనామస్మరణతో శైవ క్షేత్రం మార్మోగింది. శివోహం శివోహం అంటూ భక్తులు శివాలయంలో మొక్కులు తీర్చుకున్నారు. మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా ప్రాణహిత నదిలో పుణ్యస్నానాలు చేసి మండల కేంద్రంలోని శివాలయానికి చేరుకొని శివాలయంలో అభిషేకాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని రంగనాయక దేవాలయంతో పాటు శివాలయం, పోతులూరి వీర బ్రహ్మంగారి, హనుమాన్ ఆలయాల్లో పూజలు చేశారు. ఉదయం నాలుగు గంటల నుండి ఆలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి. ఎస్ఐ ప్రవీణ్ కుమార్ దంపతులు, ప్రముఖులు పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు తంగడపల్లి మహేష్‌ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

పెంచికల్‌పేట్ : పెంచికల్‌పేట్ గ్రామ శివారులో గల భద్రకాళి ఆలయంలో శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు కాళికామాత ఆలయ ప్రాంగణంలో జాతర జరుగుతుందని ఆలయ అర్చకులు శివప్రసాద్ తెలిపారు. అగర్‌గూడ గ్రామంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ దేవత మారెమ్మను ఊరేగింపుతో నదీ తీరానికి తీసుకెళ్లి గ్రామస్తులంతా స్నానాలు ఆచరించారు. మండల కేంద్రంలోని కోదండ రామాలయం ఆవరణలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

కౌటాల : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల ఆలయాల్లో ఉదయం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రానికి సమీపంలో ఉన్న వార్ధ పెన్‌గంగ ప్రాణహిత నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి తాటిపెల్లి కుర్తా సిద్ధి హన్‌మాన్, తుమ్మిహెట్టీ వద్ద కార్తీక్ స్వామిని సదాశివపేటలో శివాలయంలో శివ పార్వతులను, కంకాలమ్మ గుట్టపై కంకాలమ్మ కేతేశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు. ఆయా ఆలయాల అధ్యక్షులు ఎల్ములె దత్తు, సుల్వ కనకయ్య, బొంలంపల్లి ప్రకాష్ గౌడ్, ఆలయ పూజారి అంబేద శంకరయ్య, సంతోష్, కమిటీ సభ్యులు భక్తులకు ఏర్పాట్లు చేసి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



కౌటాల : ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పెంచికల్‌పేట్ : మారెమ్మ ఉత్సవ విగ్రహాన్ని నది తీరానికి తీసుకొచ్చి స్నానాలు చేస్తున్న భక్తులు

4

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మంచిర్యాల

గురువారం | ఫిబ్రవరి 27, 2025 | www.navatelangana.com

నేడు జడ్పీ స్కూల్‌లో ఎమ్మెల్సీ పోలింగ్

నవతెలంగాణ-హాజీపూర్



గురువారం జరగనున్న పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ మండల కేంద్రంలోని జడ్పీ హై స్కూల్ జరగనుంది. మండలానికి చెందిన 1352 మంది పట్టభద్రులు, 20 మంది టీచర్లు ఓటు హక్కు వినియోగించుకోన్నారు. ఉమ్మడి అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రులు ఎమ్మెల్సీ స్థానానికి 56 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 15 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. గురువారం ఉదయం 8 గంటల నుండి 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. కాగా అధికారులు పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్పాండే పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.

48 గంటల నిబంధన పకడ్బందీగా అమలు చేయాలి

నస్పూర్ : ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా విదించిన 48 గంటల నిబంధనను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ సభలు, సమావేశాలు, ఊరేగింపులు జరుపకూడదని తెలిపారు. ప్రచార, ప్రసార, ఇతర ఉపకరణాలు, ఇంటింటి సందర్శన, ఇతర ప్రచార కార్యక్రమాలు అన్ని నిబంధనకు లోబడి ఉంటాయని, ఎక్సైజ్ చట్టం ప్రకారం అన్ని పరిమితులు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం, మొబైల్ ఫోన్ల వాడకం, వాహనాలపై ఆయుధాలతో వెళ్లడం, రవాణా కోసం ఉపయోగించే ఏ రకమైన వాహనం ద్వారానైనా ఓటరును ప్రత్యక్షంగా, పరోక్షంగా పోలింగ్ కేంద్రానికి, బయటికి తీసుకువెళ్లే ఏర్పాట్లు చట్టరీత్యా నేరమని తెలిపారు. పోలింగ్ ప్రాంతంలో 5 కంటే ఎక్కువ మంది వ్యక్తులు కలిసి ఉండడాన్ని నిషేధిస్తూ ఆంక్షలు జారీ చేయడం జరిగిందని, 48 గంటల నిబంధన ఈ నెల 27న జరగనున్న పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు అమలులో ఉంటుందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

శివ నామస్మరణతో మారుమోగిన పర్వతగిరి

- భక్తజన సందోహమైన గట్టుమల్లన్న గుట్ట

నవతెలంగాణ-జైపూర్

మహా శివరాత్రిని పురస్కరించుకుని వేలాల గట్టుమల్లన్న దర్శనార్థం తరలివచ్చిన భక్తుల శివనామ స్మరణలతో పర్వతగిరి మారుమ్రోగింది. బుధవారం తెల్లవారక ముందు నుండే భక్తుల రాకపోక మొదలైంది. లక్షలాధిగా తరలివచ్చిన భక్తులతో గట్టుమల్లన్న గుట్ట జనసందోహంగా మారింది. ఉపవాస దీక్షతో ఉన్న భక్తులు గట్టుమల్లన్నను దర్శించుకుని తెల్లవార్లు జాగరణలో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలల నుండి భక్తులు అత్యధికంగా తరలిచ్చారు. వేలాల శివారు గుట్టదొనలో వెలిసిన గట్టుమల్లన్న పిలిచిన పలికే దేవునిగా కీర్తంచబడుతున్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని మూడు రోజుల పాటు జాతర జరుపుకోనుండగా వారం పది రోజుల నుండి భక్తులు మల్లన్న దర్శనార్థం వచ్చిపోతున్నారు. బుధవారం రాత్రి 12 గంటలకు గట్టుమల్లన్న ఆలయంలో నిశీ పూజ నిర్వహిస్తున్నారు. అదే విధంగా రాత్రి 7 గంటలకు వేలాల గ్రామంలో గల ఆలయంలో భ్రమరాంబికా మల్లిఖార్జున స్వామికి దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో కళ్యానం జరిపించడం ఆనవాతిగా పాటిస్తామని ఆలయ ఈఓ రమేష్ తెలిపారు. యాదవుల కులదైవమైన మల్లన్నకు సాంప్రదాయ పద్ధతుల్లో



జైపూర్ : గుట్టపైకి కాలినడకన వెళ్తున్న ఎమ్మెల్యే వివేక్

పూజలు నిర్వహిస్తుండగా మల్లన్నను దర్శించుకున్న భక్తులు భక్తి శ్రద్ధలతో పట్నాలు వేసి తీపి వంటకాలు నైవేద్యంగా సమర్పిస్తారు. గుట్టపై వెలిసిన గట్టుమల్లన్నను దర్శించున్న అనంతరం వేలాల గ్రామంలో వెలిసిన మల్లిఖార్జున స్వామిని ధర్శించుకోవడానికి చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి-సరోజన దంపతులు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కాలినడకన వచ్చి మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. భక్తులు ఆనవాయితిగా పాటిస్తారు. గోదావరి నది జలాల స్నానానికి యాదవ సాంప్రదాయ పదద్ధతుల్లో ఒగ్గు పూజారులు మధ్య కొనసాగుతుందని



తాండూర్ : బుగ్గ ఆలయానికి వెళ్లే రోడ్డులో ట్రాఫిక్ జామ్



జైపూర్ : మల్లికార్జున స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

ఈఓ రమేష్ తెలిపారు. గురువారం ఉదయం మల్లిఖార్జున స్వామి ఆలయంలో పెద్దపట్నం వేసి భక్తులను స్వామివారి దర్శనార్థం అనుమతించడం జరుగుతుందని అన్నారు.

పటిష్టమైన పోలీసు బందోబస్తు

వేలాల జాతరకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం వేలాల గ్రామాన్ని సంధర్శించిన మంచిర్యాల డీసీపీ భాస్కర్ బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు. శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, స్థానిక ఎస్ఐ శ్రీధర్ బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు. భక్తుల రాకపోకలు, రహదారి మార్గాలను సీసీ కెమెరాల ద్వార పర్యవేక్షించడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఎక్కడికక్కడ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసుకున్న కంట్రోల్ రూమ్ ద్వార జాతర ఏరియాలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.



జైపూర్ : వేలాలకు గట్టు మంల్లన్న జాతరకు తరలివచ్చిన భక్తజనం

మల్లిఖార్జునస్వామిని దర్శించుకున్న రామగుండం సీపీ

భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాసు అధికారులను ఆదేశించారు. బుధవారం వేలాల జాతరను సంధర్శించిన ఆయన గుట్టుపై వెలసిన గుట్టమల్లన్నతో పాటు గ్రామంలో గల ఆలయంలో వెలిసిన మల్లిఖార్జునస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఆర్ఐ సంపత్, జైపూర్ ఎస్సై శ్రీధర్ పాల్గొన్నారు.

బుగ్గ ఆలయంలో ఘనంగా శివరాత్రి ఉత్సవాలు

తాండూర్ : శివరాత్రి పర్వదినం సందర్భంగా బెల్లంపల్లి పరిధిలోని బుగ్గ ఆలయంలో శివపార్వతుల కళ్యాణం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని తాండూర్, భీమిని, కాసిపేట, నెన్నెలా మండలాలకు చెందిన ప్రజలు జాతరలో పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం దేవదాయ శాఖ వారు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. మంచినీరు సౌకర్యం కల్పించారు. జాతరకు భక్తుల రద్దీ ఎక్కువ కావడంతో రెండు కిలోమీటర్ల దూరం ట్రాఫిక్ జామ్ అయింది. రెండు గంటల పాటు ట్రాఫిక్ రద్దీలో ఇరుక్కున్న ప్రజలు పలు ఇబ్బందులు పడ్డారు. బెల్లంపల్లి సబ్ డివిజన్ పోలీసులు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా భద్రత ఏర్పాట్లు చేశారు. జాతరలో మున్నూరుకాపు సంఘ సభ్యులు, మార్వాడి వ్యాపారస్తులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆలయాన్ని సందర్శించి ముక్కులు చెల్లించుకున్నారు. సతీ సమేతంగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. బెల్లంపల్లి నుండి బుగ్గ ఆలయం వరకు తాండూరు మండలం బోయపల్లి నుండి బుగ్గ ఆలయం వరకు కొత్తగా రోడ్డు సౌకర్యం మెరుగవడంతో జాతరకు భక్తుల సందడి ఎక్కువగా కనిపించింది. మండలంలోని సన్నాసుల మఠం వద్ద జాతర కొనసాగింది. మండలంలోని నాయకులు ప్రజలు జాతరలో పాల్గొన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే సన్నాసుల మఠం జాతరను సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో ఎమ్మెల్యే వినోద్ ప్రజలతో వ్యక్తిగతంగా సెల్ఫీలు దిగి భక్తులను సంతృప్తి పరిచారు.

మహాప్రస్థానంలో ఎమ్మెల్యే దంపతుల పూజలు

మంచిర్యాల : జిల్లా కేంద్రంలోని గోదావరి రోడ్‌లో నిర్మించే మహా ప్రస్థానంలో బుధవారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శివరాత్రి పర్వదినం సందర్భంగా మహా ప్రస్థానంలో శివుడికి మహా



జైపూర్ :మల్లికార్జున స్వామికి భోనాలు సమర్పించిన భక్తులు

రుద్రభిషేకం, శివ అర్చన నిర్వహించినట్లు తెలిపారు. రాష్టంలో ఎక్కడ లేని విధంగా మంచిర్యాల జిల్లాలో మహా ప్రస్థానం నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల ముందు చెప్పినట్లు మంచిర్యాలలో రూ.11 కోట్లతో మహా ప్రస్థానం నిర్మించడం జరిగిందని, దీనితో మంచిర్యాల జిల్లా ప్రజలకు చివరి మజిలీ కష్టాలు తీరనున్నాయన్నారు. వర్షాకాలం వచ్చిందంటే వరదల్లో మంచిర్యాలలో వైకుంఠదామం కనపడకుండా పోయేదాని, చాలా సందర్భల్లో రోడ్డు పైనే దహన సంస్కారాలు జరిపేవరని ఇకపై అలాంటి కష్టాలు ఏర్పడవని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్ పాల్గొన్నారు.



మంచిర్యాల : మహాప్రస్థానంలో పూజలు నిర్వహిస్తున్న మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు దంపతులు

ఆటో డ్రైవర్లను ప్రభుత్వమే ఆదుకోవాలి



నవతెలంగాణ-తాండూర్

ఆటో డ్రైవర్లను ప్రభుత్వమే ఆదుకోవాలని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ కోరారు. బుధవారం బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్ల బతుకులు రోడ్డున పడ్డాయ న్నారు. ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని ప్రభుత్వం హామీలు ఇచ్చినప్పటికీ అమలు పరచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో గిరాకులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నెలవారికి కిస్తీలు ఇంటికిరాయిలు పిల్లల చదువుల ఫీజులు కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి తీర్చలేక కుటుంబాన్ని పోషించుకోలేక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం రవాణా రంగంపై ఆధారపడ్డ ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపాలన్నారు. లేనియెడల మంచిర్యాల జిల్లాలోని ఉన్న ఆటో డ్రైవర్స్ అండ్ యూనియన్ నాయకులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, ఆరేపల్లి సతీష్, తోగారి రాహుల్, రవి, శంకర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

నవతెలంగాణ-తాండూర్

ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తాండూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. ఎన్నిక నియమావళి నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 163 పీఎస్ఎస్ఎస్ సెక్షన్ అమలులో ఉంటున్న నేపథ్యంలో 200 మీటర్ల పరిధిలో ఆంక్షలు ఉంటాయన్నారు. ఎన్నికల నియమాలను ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికల పోలింగ్ ప్రక్రియ విజయవంత ముగిసేంత వరకు ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



నవతెలంగాణ-జన్నారం

ది మురిమడుగు యూత్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మురిమడుగులోని వృద్ధులందరికీ బుధవారం దుప్పట్లు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మురుమడుగు యూత్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పేదలకు నిరుపేదలకు ఎన్నో సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అమర కొండ రాజేష్, ప్రధాన కార్యదర్శి జాడి రాజేందర్, గోట్ల తిరుపతి యాదవ్. గౌరవ సలహాదారు తుంగతుర్తి ప్రకాష్‌రావు, కొండగొర్ల లక్ష్మయ్య, కుంభాల రామన్న పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ నియోజకవర్గాల పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుల ఎన్నికలలో భాగంగా ఫిబ్రవరి 27న పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీఓలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ లతో కలిసి కలెక్టర్ కార్యాలయంలో గల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ శాసనమండలి సభ్యుల ఎన్నికల పోలింగ్ ఈ నెల 27వ తేదీ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని, ఇందుకు ర్యాండమైజేషన్‌లో కేటాయించిన ప్రకారంగా ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లాలో 60 మంది ప్రిసైడింగ్ అధికారులు, 181 మంది పోలింగ్ అధికారులు, 25 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించడం జరిగిందని తెలిపారు. పోలింగ్ రోజున పట్టభద్రుల ఎన్నికలో 19 వేల 41 మంది పురుషులు, 11 వేల 880 మంది మహిళలు, ఉపాధ్యాయుల ఎన్నికలో 999 మంది పురుషులు, 665 మంది మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు 18 పోలింగ్ కేంద్రాలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు 40 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇందులో 8 కామన్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది తమ విధులు బాధ్యతాయుతంగా నిర్వహించాలని, జిల్లాలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఓటు హక్కు తప్పక వినియోగించుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రులు ఉటుహక్కును తప్పక వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన కార్యాలయాలు, సంస్థలు, ప్రభుత్వ పాఠశాలలు, విద్యా సంస్థలకు ఈ నెల 27న పోలింగ్ రోజు, 26న పోలింగ్ ముందు రోజు, మార్చ్ 3వ తేదీ కౌంటింగ్ రోజులలో వేతనంతో కూడిన సెలవు ప్రకటించడం జరిగిందని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-కాసిపేట

మండలంలో గురువారం నిర్వహించే పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాసిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేశారు. పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి ఒక పోలింగ్ కేంద్రం, ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించి ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. పట్టభద్రుల ఎన్నికలకు 48 నెంబర్ పోలింగ్ కేంద్రంలో 461 పురుషులు, 301 మహిళా పట్టభద్రుల ఓట్లు మొత్తం 762 మంది ఓటర్లు ఉన్నారు. ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించి 27 నెంబర్ పోలింగ్ కేంద్రంలో పురుషులు 10, మహిళలు 6 మొత్తం 16 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్త్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎటువంటి



సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బందికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేసి విధులను కేటాయించారు.

జనసంద్రమైన గోదావరి తీరం

- స్నానం ఆచరించిన మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

నవ తెలంగాణ-లక్షెట్టిపేట

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గోదావరి పుష్కరఘాట్‌లో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు పుణ్య స్నానం ఆచరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుణ్య స్నానాలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

గోదావరిలో భక్తుల పుణ్య స్నానాలు

జన్నారం : మండలంలోని గోదావరి నది పరివాహక ప్రాంత గ్రామాలైన, కలమడుగు ధర్మారం, బాదంపల్లి, చింతాగూడా రోటి గూడ తపాలాపూర్ తిమ్మాపూర్, రాంపూర్‌లలో ఆయా గ్రామాల ప్రజలతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భక్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లి మహాశివరాత్రి పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. తపాలపురం గ్రామంలో ఉన్న శివాలయంలో భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలోని రాంపూర్ గ్రామంలో ఉన్న వెంకటేశ్వర, స్వామి, తిమ్మాపూర్ గ్రామంలో సత్యనారాయణ రామాలయం శివాలయాల్లో అలాగే మండల కేంద్రంలో ఉన్న శ్రీ రామాలయంలో, మందపల్లిలో ఉన్న రామాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. 101 శివలింగాలకు ప్రత్యేక పూజలు. మండలం లోని రోటిగూడ గ్రామంలో ఉన్న గీత మందిర్లో 101 శివలింగాలకు పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి మౌన స్వామి ఆధ్వర్యంలో వేద పండితులు ఆ శివలింగాలకు రుద్రాభిషేకం చేశారు.



దండేపల్లి : గోదావరిలో స్నానం ఆచరిస్తున్న భక్తులు

కాసిపేట : మండలంలో బుధవారం మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు స్థానిక ఆలయాలకు తరలివెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అధికంగా ప్రజలు మంచిర్యాల గోదావరికి తరలివెళ్లి పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. కాళేశ్వరం, బుగ్గ దేవాలయం, వేలాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి తమను చల్లంగా చూడాలని ఆ దేవుడికి మొక్కలు చెల్లించుకున్నారు.

నస్పూర్ : మహాశివరాత్రి సందర్భంగా బుధవారం సీతారాంపల్లి లోని గోదావరిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా మున్సిపాలిటీ అధికారులు, పోలీస్ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. ఘాట్ వద్ద డ్రెస్సింగ్ రూం, టాయిలెట్‌లను ఏర్పాటు చేశారు.

రెడ్డి పరివారం ఆధ్వర్యంలో పండ్లు, మజ్జిగ పంపిణి

రెడ్డి పరివారం ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా రెడ్డి పరివారం ఆధ్వర్యంలో గోదావరిలో స్నానాలు ఆచరించిన భక్తులకు పండ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, రెడ్డి పరివారం అధ్యక్షుడు రాఘవరెడ్డి, వెంకట్ రెడ్డి, గొట్టం తిరుపతిరెడ్డి, కెడిక ప్రకాష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



గోదావరిలో స్నానం చేసిన నడిపెల్లి దివాకర్‌రావు

దండెపల్లి : మహా శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకొని మండలంలోని ద్వారక, లక్ష్మీకాంతపూర్, గూడెం గోదావరి నది తీరాల వద్ద బుధవారం భక్తులు పెద్ద ఎత్తున పుణ్య స్నానాలు ఆచరించారు. గూడెం గోదావరి వద్ద సరిహద్దు జిల్లాలోని భక్తులు పెద్ద ఎత్తున పుణ్య స్నానాలు ఆచరించి గూడెం సత్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. భక్తుల తాకిడితో గోదావరి నది తీరం జనసంద్రంగా మారింది. దండేపల్లి పోలీసుల ఆధ్వర్యంలో గోదావరి నది వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. నీరు ఎక్కువగా ఉండడంతో నది తీరంలో లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.